సమస్యల్లో పల్లె దవాఖానా

- నీరు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- ప్రహరీ లేకపోవడంతో పశువుల సంచారం

పెద్దవంగర: పల్లె దవాఖానా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అందించిన అతి ముఖ్యమైన వనరు. ఈ దవాఖానాలు ముఖ్యంగా పల్లెల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు ఏర్పడ్డాయి. ప్రజలు పట్టణాలకు వెళ్లకుండానే తక్కువ ఖర్చుతో సమయానుకూలంగా వైద్య సేవలు పొందేందుకు ఇవి ఒక మార్గం. పల్లె దవాఖానాలు ప్రజలకు నాడిలాంటి సేవా కేంద్రాలుగా పని చేస్తాయి. మండలంలోని 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చిట్యాల, పెద్దవంగర, వడ్డెకొత్తపల్లి, గంట్లకుంట, పోచంపల్లి, అవుతాపురం గ్రామాల్లో పల్లె దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అవుతాపురం గ్రామంలోని పల్లె దవాఖానా ఒకే గదిలో కొనసాగుతోంది గ్రామంలో 2,256 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ పల్లె దవాఖానాలో వైద్యురాలు, ఏఎన్ఎం, ఇద్దరు ఆశాలు వైద్య సేవలు అందిస్తున్నారు. రోజుకు సగటు 20మంది రోగులు వైద్య సేవలు పొందుతూ ఈ దవాఖానను ఆశ్రయిస్తున్నారు. సేవలు అందిస్తున్న తీరులో నిబద్ధత కనిపిస్తున్నా, సమస్యలు వెంటాడుతున్నాయి.


అవుతాపురం పల్లె దవాఖానా

మరుగుదొడ్లు లేవు..

వైద్య సేవలకు వచ్చే రోగులకు మంచినీటి సౌకర్యంతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య సిబ్బంది కూడా తీవ్ర అసౌకర్యాల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్‌ను ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియని పరిస్థితి. పల్లె దవాఖానాకు పక్కా భవనం ఉన్నప్పటికీ ప్రహరీ లేకపోవడంతో పశువులు, సంచరిస్తున్నాయి. సంబంధిత అధికారులు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వసతుల కల్పనకు కృషి

అవుతాపురం పల్లె దవాఖానాలో మౌలిక వసుతుల కల్పనపై చొరవ తీసుకొంటాం. విధులు నిర్వహించే చోట సరైన వాతావరణంలో కల్పిస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మౌలిక వసతులు కల్పించి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– రవి రాథోడ్, జిల్లా వైద్యాధికారి

అమరుల త్యాగాలు మరువం

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

కొత్తగూడ: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులను మరువబోమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మండలంలోని ఎంచగూడెం గ్రామంలో బంధుమిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండి అల్లోరు అలియాస్ దేవన్న, భరత్ 25వ సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో దున్నే వాడికి భూమి లేక, దున్నుకుందామంటే అటవీ శాఖ అధికారుల అరాచకాల తట్టుకోలేక జనం అల్లాడుతున్న సమయంలో భరత్ తుపాకీ చేతపట్టి జనశక్తి పార్టీలో పని చేశాడని గుర్తు చేశారు. పేదల పక్షాన పాలక పక్షాన్ని నిలదీస్తే బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని అన్నారు. అనంతరం భరత్‌ను స్మరిస్తూ రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మంత్రి సీతక్క తనయుడు సూర్య, న్యూడెమోక్రసీ మాజీ దళ కమాండర్ సూర్యం, నాయకులు వెంకటయ్య, శ్రీశైలం, ఆగబోయిన రవి పాల్గొన్నారు.


సీడీ ఆవిష్కరిస్తున్న విమలక్క, నాయకులు

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్


అరెస్టు చూపుతున్న డీఎస్పీ తిరుపతిరావు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామశివారు పంటపొలం వద్ద ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని స్కూటీపై పరారైన ఇద్దరు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వలకు చెందిన బొడ్డు వెంకటమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం పంటపొలం వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉంది. నెల్లికుదురు మండలం తారాసింగ్‌బావి శివారు అవుసలితండాకు చెందిన మౌర్య హేమంత్, మహబూబాబాద్ పట్టణంలోని పాతబజార్‌కు చెందిన రున్వాల్ వినోద్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి స్కూటీపై వచ్చి, కాపుకాసి ఆ వృద్ధురాలి మెడలో ఉన్న 2తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బావి వద్ద బాధితురాలి మనుమడు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. కేసముద్రం మండలంలోని కోరుకొండపల్లి రోడ్డు వద్ద ఆ ఇద్దరు వ్యక్తులను శనివారం పట్టుబడ్డారు. వారివద్ద గొలుసు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరిగతిన చేదించిన డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, సీసీఎస్ సీఐ హతిరాం, ఎస్సైలు మురళీధర్‌రాజు, సీహెచ్ రమేష్‌బాబు, సీసీఎస్ ఎస్సై తహెర్ బాబాలను ఎస్పీ రామ్‌నాథ్‌కేకన్ అభినందించారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

గూడూరు: బాలికలు విద్యార్థి దశ నుంచే ధైర్యాన్ని చూపాలని, అన్నిరంగాల్లో రాణించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ దేశీరాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన హర్ వాయిస్ దిశ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే బాల్యవివాహాల వల్ల నష్టాలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనే విషయాలను గమనించి, మానసికంగా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలతోపాటు కిచెన్, డైనింగ్ హాల్, గదులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమృత, ఉపాధ్యాయులు వీరయ్య, శ్రీలత, ప్రసాద్, ఉమారాణి, వార్డెన్ దేవదేవి, షబ్నా పర్వీన్, ప్రియాంక, షెర్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీడీ దేశీరాం

అపరిచిత కాల్స్ లిఫ్ట్ చేయొద్దు


మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. మహిళలు, బాలల రక్షణ చట్టాలు, షీటీం విధులు, మానవ అక్రమ రవాణ, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై మండలంలోని బ్రాహ్మణపల్లి (లక్ష్మీపురం) ప్రభుత్వ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయొద్దని, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సమాజంలో సెల్ ఫోన్లలో ఆన్ లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అటువంటి మోసాలకు గురికాకుండా మిమ్మల్ని మీరే కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బద్రునాయక్, షీ టీం సిబ్బంది అరుణ రమేష్, పీసీ సుప్రజ, భరోసా లీగల్ అడ్వైజర్ సాహిత్య, బేబీ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో అధికారుల తనిఖీలు

డోర్నకల్: స్థానిక మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలతోపాటు కస్తూర్బా పాఠశాలలో శనివారం మండల ప్రత్యేక అధికారి తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో భోజనాన్ని తనిఖీలు చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానియల్, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని బయ్యారం, ఇర్సులాపురం గ్రామాల్లోని పలు హాస్టళ్లను శనివారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ రమేష్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ అఖీల్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను శనివారం తహసీల్దార్ చంద నరేష్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింగారపు కుమార్, ఎంపీఓ పద్మ, మండల వైద్యాధికారి శారద, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు


నర్సింహులపేట: మోడల్ స్కూల్‌లో బోనాలతో విద్యార్థినులు


మహబూబాబాద్ అర్బన్: ఏకశిల ఏంజిల్స్ హైస్కూల్‌లో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల వేడకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను ఎత్తుకొని సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో బ్లాక్ గ్రానైట్ క్వారీ తవ్వకాలపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మన్నెగూడెం, చిలుకొయ్యలపాడు గ్రామాల శివారులో సర్వే నంబర్లు 394/ఏ, 395/ఏ/2, 395/ఏ/6లలోని 3.40 హెక్టార్ల భూమిలో కేఎస్ఆర్ గ్రానైట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో బ్లాక్ గ్రానైట్ తవ్వకం కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అడిషనల్ కలెక్టర్ లెనిన్ ఉత్సవ్ టొప్పో, పర్యావరణ శాఖ ఈఈ సునీత ఆధ్వర్యంలో స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. క్వారీ ఏర్పాటుతో భూగర్భ జలాలు అడుగంటుతాయని, రోడ్లు ధ్వంసమవుతాయని, గాలిలో దుబ్బ కలిసి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు ఎదురవుతాయని కొంత మంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి పూర్తిస్థాయిలో అభిప్రాయాలను సేకరిస్తామని అధికారులు తెలిపారు.


అధికారుల ముందు అభిప్రాయాన్ని వెల్లడిస్తున్న గ్రామస్తుడు

మెయింటెనెన్స్ ఫ్యాక్టరీ మంజూరు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలో వందేభారత్ కోచ్ మెయింటెనెన్స్ ఫ్యాక్టరీ మంజూరు చేస్తూ కేంద్ర రైల్వే శాఖ మినిస్టర్ ఉత్తర్వులను జారీ చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మానుకోట బీజేపీ నాయకులు కేంద్ర రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేశారన్నారు. దీని ఫలితమే మెయింటెనెన్స్ ఫ్యాక్టరీ మంజూరు అయిందన్నారు. దీంతో జిల్లాలో సుమారు 5వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కేంద్ర రైల్వే మంత్రి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్ శర్మ, మాజీ అధ్యక్షుడు చీకటి మహేష్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గడ్డం అశోక్, నాయకులు సతీష్, రాము పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బయ్యారం: మండలంలోని జాప్రభాద్‌కు చెందిన మాళోత్ శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మిత్రుడి కుటుంబానికి మృతుడి బాల్యమిత్రులు శనివారం రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు ఉపేందర్, సోమేష్, పవన్, సుమన్, మంగీలాల్, నరేష్, పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన అన్‌మ్యాన్ విద్యుత్ కార్మికుడు బుర్ర శ్రీకాంత్ ఇటీవల విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతి చెందాడు. దీంతో మండల కేంద్రంలోని ఏఏఓ/ఈఆర్ఓ కార్యాలయ సిబ్బంది శనివారం బాధిత కుటుంబానికి రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో క్యాషియర్ భద్రసింగ్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, కట్ల వెంకన్న, మహేందర్ పాల్గొన్నారు.


బయ్యారం: ఆర్థికసాయం చేస్తున్న బాల్యమిత్రులు

ప్రభుత్వం ఆదుకోవాలి

తొర్రూరు: ఎరుకల సామాజిక వర్గాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు అన్నారు. ఆగస్టు 3న హైదరాబాద్‌లో చేపట్టే సంస్థ ఆవిర్భావ వేడుకల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నడిగడ్డ శ్రీనివాస్, నడిగడ్డ సంపత్, సదానందం, మధు, యాకయ్య, అంజి, సోమయ్య, వీరేందర్, ఉప్పలయ్య, కృష్ణమూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మహబూబాబాద్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కృష్ణతేజ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజీమ్, ప్రిన్సిపాల్ హర్షిత, ఎస్సై మురళీధర్‌రాజు, సెకండ్ ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: డోర్నకల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్‌లో సంతకం పెట్టి అనుమతులు లేకుండా ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని ఎంఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్, సూర్యప్రకాష్ డీఈఓ రవీందర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు.

క్షయ వ్యాధిని అంతం చేయాలి

గంగారం: క్షయ వ్యాధి అంతం అందరి బాధ్యత అని వైద్యులు ప్రత్యూష, శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టీబీ ముక్తాభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి స్క్రీనింగ్ నిర్వహించారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఇస్లావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గల ఓ భూమి వివాదంలో రెండు వర్గాల బాధ్యుల మధ్య వాగ్వివాదం జరిగి శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణ అనంతరం రెండు వర్గాలకు చెందిన ఇస్లావత్ శ్రీను, ఇస్లావత్ నరేష్, భూక్య హట్టి, భూక్య శ్రీను, భూక్య మోతిలాల్ కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: బయ్యారం మండలం నామాలపాడు ఈఎంఆర్ఎస్ స్కూల్‌లో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడికి సహకరించిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రీజనల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌కు శనివారం వినతి ప్రతం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తొర్రూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని మాటేడు గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

బాధ్యతల స్వీకరణ

దంతాలపల్లి: దంతాలపల్లి ఎంపీడీఓగా విజయ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మరిపెడ మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న విజయ బదిలీపై దంతాలపల్లి ఎంపీడీఓగా విధుల్లో చేరారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కొత్తగూడ: ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రత్యేక చట్టం 1/70కి లోబడి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు రాజేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రశాంత్, సుధాకర్, సాంబరాజు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాపై అవగాహన

బయ్యారం: బాలికల అక్రమ రవాణాపై శనివారం బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, స్టూడెంట్ కౌన్సిలర్ వెంకటలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓ సంతోష్‌కుమార్, అధ్యాపకులు స్నేహ, సరిత, వెంకటగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

జీఓను సవరించాలి

కొత్తగూడ: ఉపాధ్యాయుల పని సర్దుపాటు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 25ను సవరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో పొట్టయ్య, రమేశ్, ప్రభాకర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొత్తగూడ: జీఓ నంబర్ 49 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 తలపెట్టిన ఏజెన్సీ మండలాల బంద్ విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

గార్ల: బాలికలు మనోధైర్యంతో ముందుకు సాగుతూ అన్నిరంగాల్లో బాలురతో సమానంగా బాలికలు రాణించాలని శిక్షకులు ప్రియ, నిశిత సూచించారు. పది రోజులుగా ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న వాయిస్ ఆఫ్ గర్ల్స్ శిక్షణ శనివారం ముగిసింది. అనంతరం శిక్షణ ఇచ్చిన మహిళలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ జోగయ్య, వార్డెన్ రాధిక, ఉపాధ్యాయులు, పీడీ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

గార్ల: ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణంను పరిరక్షించుకోవాలని గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు సూచించారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగూర్, రామ్మోహన్‌రావు, చార్లీ, పున్నంచందర్, రాజేష్, సుందరయ్య, వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ అందరి బాధ్యత

పెద్దవంగర: పిల్లల భవిష్యత్ పౌరులు, వారి అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవరించాలని తహసీల్దార్ మహేందర్, ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి పోస్టర్లను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొనికెన కుమారస్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

బయ్యారం: ఆగస్టు 23, 24 తేదీల్లో గార్లలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్(సీఐటీయూ) రాష్ట్ర మహాసభల కరపత్రాలను శనివారం బయ్యారంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, మండల కన్వీనర్ వల్లాల వెంకన్న పాల్గొన్నారు.

గార్లలో కవిటి పీరీల పండుగ

గార్ల: గార్లలో కవిటి పీరీల పండుగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. మొహరం పండుగ అనంతరం గార్లలో వంశపారపర్యంగా కొనసాగుతున్న కవిటి పీరీల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

'అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు'

గార్ల: గార్ల మేజర్ గ్రామ పంచాయతీలో అర్హులను వదిలేసి, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని గార్లలోని వార్డు మాజీ సభ్యుడు మొగిలి వెంకన్న ఆరోపించారు. శనివారం గార్లలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. అధికారులు సర్వే చేసి అసలైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

తొర్రూరు: ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ సహకరించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ తమ్మెర లక్ష్మీనరసింహరావు పుట్టినరోజు సందర్భంగా సేవా తరుణి ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, లయన్స్ ప్రతినిధులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, శారద, వజినపల్లి దీప, కిరణ్‌కుమార్, పద్మావతి, మంజుల, శైలజ పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ

పొలాల్లోకి దూసుకెళ్లిన వాహనం

కేసముద్రం: అదుపుతప్పిన అశోక్‌లేలాండ్ వాహనం పంటపొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అశోక్‌లేలాండ్ వాహనంలో తొర్రూరు నుంచి ఇనుగుర్తి వైపుకు వస్తుండగా, గ్రామశివారు బంగారు కత్వచెరువు కట్టపై ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయాడు. దీంతో అదుపుతప్పిన వాహనం పంటపొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. డ్రైవర్ శ్రీకాంత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అతడిని 108లో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు.


పొలంలో బోల్తాకొట్టిన వాహనం

క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటుగా ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మానుకోటలో శ్రీచైతన్య పాఠశాల బృందం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాసా ఏఎంఈఎస్ రీసెర్చ్ సెంటర్, నేషనల్ స్పేస్ సొసైటీ, యూఎస్ఏ నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ పోటీలో శ్రీచైతన్య పాఠశాల బృందం ఎంపికైంది.ఈ సందర్భంగా ఎస్పీ అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.కె.మదార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

మహబూబాబాద్: దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్పీఆర్డీ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నరేష్, సారయ్య, ప్రభాకర్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టోర్ ఏర్పాటు

నెహ్రూసెంటర్: జిల్లాలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు స్టోర్ నుంచి పరికరాలను సులభంగా డ్రా చేసుకునేందుకు వీలుగా జిల్లాలో విద్యుత్ సబ్ స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ పనులకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉండేలా స్టోర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సూపరింటెండింట్ ఇంజనీర్లు స్టోర్ల పనితీరుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని కోరుతూ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్నగౌడ్, బిక్కి వెంకటేశ్వర్లుగౌడ్, ముత్యం వెంకన్నగౌడ్, బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మెగా ప్లాంటేషన్ మేళా

నెల్లికుదురు: మండలంలో 16 ఎకరాల్లో శనివారం ఆయిల్‌పాం మొక్కలు నాటి మెగా ప్లాంటేషన్ మేళాను నిర్వహించినట్లు ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి జినుగు మరియన్న అన్నారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడారు. కార్యక్రమంలో నర్మద, రాజేష్, కుమార్, అశోక్, రాణా ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. రాములు తెలిపారు. డైరీ సైన్స్, పొలిటికల్ సైన్స్, సెరీకల్చర్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ సబ్జెక్టుల్లో ఖాళీగా ఒక్కో పోస్టును, ఇంగ్లిష్‌లో రెండు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పీజీలో 55శాతం ఉత్తీర్ణత, ఎస్సీ, ఎస్టీలకు 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యముంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 22, 23 తేదీల్లో దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు. ఇతర వివరాలకు 95421 10611 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుమ్టీలు తొలగించొద్దు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో బందం చెరువు వద్ద ఉన్న గుమ్టీలను తొలగించాలని నోటీసులు ఇవ్వడం సరికాదని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చిరువ్యాపారులు సురేష్, గోపాల్, సైదులు, రవి, వీరభద్రం, మహేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి అన్నారు. మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్, హైస్కూల్, ప్రాథమిక స్కూళ్లల్లో ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుధారాచారి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కరానికి నిరంతరం అనేక పోరాటాలు చేస్తున్న సంఘం కేవలం ఎస్టీయూ మాత్రమేన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాకుబ్‌రెడ్డి, చంద్రప్రకాష్, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646